## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**అంబాజీపేట:** స్థానిక జయంతినగర్ వద్ద ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జయంతి నగర్‌కు చెందిన జల్లి జయరాజు, కోట నాగేంద్ర బైక్‌పై స్థానిక సెంటర్ నుంచి ఇంటికి వెళుతున్నారు. ఈ సమయంలో రాజమహేంద్రవరం నుంచి వస్తున్న కారు, బైక్ ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. క్షతగాత్రులను అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

### రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

**అంబాజీపేట:** ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలు నిలుస్తాయని అంబాజీపేట స్వామి వివేకానంద యోగా ఆశ్రమం, ఆయుర్వేదం ఫిజియోథెరపీ ఆసుపత్రి వైద్యుడు, యోగా గురువు యోగా శ్రీనివాస్ అన్నారు. కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న 12 మంది రోగులకు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదానం చేయించారు. ఎల్.ప్రవీణ్, ఎం.దుర్గారావు, కె.ఆనంద్, ఎల్.భరత్, పి.సాత్విక్, ఎ.ధనుంజయ, పి.నాగు, ఎ.మధుసూదన్, ఎస్.సూరిబాబు, బి.ప్రవీణ్, ఎల్.బాలు, సీహెచ్ కిరణ్ రక్తదానం చేసిన వారిలో ఉన్నారు. ఇప్పటి వరకు తమ యోగా ఆశ్రమం నుంచి 20 వేలకు పైగా దాతల సహకారంతో ఎంతో మంది రోగులకు రక్తదానం చేశామన్నారు.

### నేడు నీటి సంఘం ఎన్నిక

**అంబాజీపేట:** మండలంలోని కె.పెదపూడి నీటి వినియోగదారుల సంఘానికి సంబంధించి 12 మంది ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు శనివారం ఎన్నిక జరుగుతుందని ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి పుల్లేటికుర్రు హైస్కూల్‌లో జరిగే కె.పెదపూడి నీటి వినియోగదారుల సంఘం పరిధిలోని బిళ్లకుర్రు మోడేకుర్రు, ముక్కామల, మొసలపల్లి, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, వక్కలంక, గంగలకుర్రు, జి.అగ్రహారం, కె.పెదపూడి, నేదునూరు, పాలగుమ్మి, నడిపూడి గ్రామాల్లోని ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొనాలని ఎన్నికల అధికారి, ఎంపీడీవో సరోవర్ కోరారు.

### నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



విఘ్నేశ్వరస్వామి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**అయినవిల్లి:** విఘ్నేశ్వరస్వామివారి ఆలయ 2025 సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శుక్రవారం ఆవిష్కరించారు. తొలుత ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ, ఆలయ వేదపండితులు, అర్చకులు ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2025 సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అంతా శుభాలే కలగాలని స్వామివారిని కోరి ప్రార్థించారు. ఆయన వెంట కూటమి నేతలు ఉన్నారు.

### ఇద్దరు సారా విక్రేతల అరెస్ట్

**ఆలమూరు:** స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసు పరిధిలోని ఆలమూరు, మండపేట మండలాల్లో పోలీసులు జరిపిన దాడుల్లో ఇద్దరు సారా విక్రేతల అరెస్ట్ జరిగింది. ఆలమూరు ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు కథనం ప్రకారం ఆలమూరు మండలంలోని మడికిలో సారా విక్రయిస్తున్న ఉండ్రాసపు శాంతకుమారి, మండపేట మండలం ఏడిదలో సారా విక్రయిస్తున్న యార్లగడ్డ వీరవేణిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆ ముద్దాయిలను శుక్రవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండు విధించారు.

### మాలల మహాగర్జన విజయవంతం చేయాలి

**అంబాజీపేట:** ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని దీనిని అడ్డుకునేందుకు నిర్వహిస్తున్న మాలల మహా గర్జనను విజయవంతం చేయాలని అంబాజీపేట మండల మాల మహానాడు అధ్యక్షుడు నాగవరపు నాగరాజు, కార్యదర్శి నాగాబత్తుల సుధాకర్ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 15న గుంటూరులో జరిగే మాలల సింహ గర్జనకు భారీగా తరలి రావాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులు గుంటూరు సభను విజయవంతం చేయడం ద్వారా మాలల సత్తా చాటాలని కోరారు. ఆదివారం ఉదయం 8 గంటలకు అంబాజీపేట బస్టాండ్ వద్ద నుంచి మాలల సింహగర్జనకు బస్సులు వెళ్లనున్నాయని వారు వివరించారు.

**అయినవిల్లి:** మాలమాదిగల మధ్య అగాధాన్ని సృష్టించేందుకు కుట్ర అగ్రకులాలకు చెందిన రాజకీయ పార్టీల అధినాయకులు 30 ఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నారని రాక్స్ జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ ఆరోపించారు. శానపల్లిలంకలో శుక్రవారం రాక్స్ జాతీయ ఉపాధ్యక్షుడు కొంకి వెంకట్రావు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జన సమీకరణలో భాగంగా జరిగిన కార్యక్రమానికి ఎంపీటీసీ పి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాశీ వీవీ సత్యనారాయణ, దళిత నాయకులు ఉన్నారు.

# రైతు కష్టాలు పట్టని కూటమి ప్రభుత్వం

**అంబాజీపేట:** రైతులకు హామీలెన్నో ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వారి కష్టనష్టాలను పట్టించుకోని పరిస్థితులపై రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ స్పందించి అన్నదాతలకు అండగా నిలుస్తోందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. అంబాజీపేటలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో అమలాపురంలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ రైతులకు అండగా కార్యక్రమానికి శుక్రవారం భారీ ఎత్తున పార్టీ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, ఎంపీటీసీల సమైక్య మండల శాఖ అధ్యక్షుడు ఎం.ప్రశాంత్, వుందుర్తి నాగబాబు, చింతపల్లి వెంకటేశ్వరరావు మట్టపర్తి హరి, కుడుపూడి సత్తిబాబు తదితరులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు

# డ్రెయినేజీ వ్యవస్థను ఆధునీకరించాలి

- నక్కలపర్రలో 2 వేల ఎకరాలకు ముంపు సమస్య
- సకాలంలో ముంపు నీరు దిగక సాగుకు గండి

**సఖినేటిపల్లి:** మోరి, శృంగవరప్పాడు, ఉయ్యూరువారి మెరక గ్రామాల్లోని సుమారు రెండువేల ఎకరాల ఆయకట్టు భూములకు కలిపి మురుగునీరు దిగడానికి వీలుగా మోరి గ్రామ శివారు నక్కలపర్రలో డ్రెయినేజీ వ్యవస్థను ఆధునీకరించాలని ఆయకట్టు రైతులు అధికారులను కోరుతున్నారు. నక్కలపర్రలో మోరి ప్రధాన రోడ్డుకు ఒక వైపునున్న వీవీ మెరక, మోరి గ్రామాల్లోని ఆయకట్టు భూములకు సంబంధించిన ముంపునీరు, ప్రధాన రోడ్డుకు ఒక చోట ఏర్పాటు చేసిన తూరల కల్వర్టు ద్వారా రెండో వైపునున్న శృంగవరప్పాడు ఆయకట్టు భూములు మీదుగా సమీప మురుగు కాలువలోకి దిగడం పూర్వం కాలం నుంచి కొనసాగుతూ వస్తోంది. అయితే కాలక్రమంలో ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో మారుతున్న వాతావరణం, కుండపోతగా కురుస్తున్న భారీ వర్షాలు, వ్యవసాయ రంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఈ క్రమంలో పూర్వం నుంచి ఉన్న వరి చేలమీదుగా ఉన్న మురుగునీటి పారుదలకు భారీ వర్షాల సమయాల్లో చాలా రోజులు తరబడి పడుతుండడంతో వరిసాగులో ముంపునీరు సకాలంలో సమీప మురుగు కాలువలోకి దిగక ముంపు సమస్య జటిలం అవుతోందని రైతులు చెబుతున్నారు. దీంతో ఇటీవల కాలంలో ఏటా సార్వా సాగు ముందుకు సాగక ఇబ్బందులు పడుతున్నామని రైతులు అంటున్నారు.



మోరి శివారు నక్కలపర్రలో ప్రధాన రహదారి వెంబడి రివిట్‌మెంట్ చేసిన బోదె

**వరి చేలలో తూటు, గుర్రపుడెక్క**

సార్వా సీజన్‌లో భారీ వర్షాలకు ఆయకట్టు భూములు చెరువులను తలపిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. రోజులు తరబడి ముంపునీరు దిగడానికి సరైన మార్గం లేకపోవడంతో సార్వా సాగుకు పూర్తి గండి పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంపు నీటిలో పెరిగిపోతున్న తూటు, గుర్రపుడెక్క, తామర పూలమొక్కలు, రెల్లుగడ్డి మొక్కలు దమ్ము చేయడానికి వీలు లేకుండా చేస్తున్నాయని తెలిపారు. సార్వాలో వరి సాగు కంటే కలుపు మొక్కలు తొలగించుకోవడం, ముంపునీరు పూర్తిగా దిగకపోవడం పెద్ద సమస్యలుగా మారడంతో తొలి పంట సాగు చేయడం కష్టతరంగా మారిందని రైతులు పేర్కొన్నారు.

**బోదెను అభివృద్ధి చేయాలి**

మోరి శివారు నక్కలపర్రలో ప్రధాన రహదారి వెంబడి ఉన్న బోదెను ముంపునీరు దిగడానికి వీలుగా అభివృద్ధి చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. రోడ్డును ఆనుకుని బోదె గట్టుకు రక్షణ గోడను కూడా గతంలో నిర్మించారని రైతులు తెలిపారు. ముంపు నీరు అంతా కేవలం వరి చేలు మీదుగా మాత్రమే దిగుతుండడం, దిగడానికి మరో మార్గం లేక వర్షాలకు ఎదుర్కొంటున్న తీవ్ర ముంపు సమస్యల పరిష్కారినికి రోడ్డు వెంబడి ఉన్న బోదెను అభివృద్ధి చేస్తే వెసులుబాటుగా ఉంటుందని వారు పేర్కొన్నారు.



మోరి శివారు నక్కలపర్రలో వరిచేలల్లో నిల్వ ఉన్న ముంపు నీటిలో పెరిగిన గుర్రపుడెక్క

### సాగు సమస్య జటిలం

నక్కలపర్రలో నెలలు తరబడి నిలిచిపోతున్న ముంపునీరు వల్ల సార్వా వరిసాగులో అవస్థలు పడుతున్నాం. ఆయకట్టు భూములకు ముంపు నీటి సమస్య జటిలంగా మారింది.

– గెద్దం రామారావు, రైతు, శృంగవరప్పాడు

### ముంపుసమస్య పరిష్కరించాలి

వరిచేలు మీదుగా దిగడానికి చాలా సమమం పడుతోంది. ముంపునీరు త్వరితగతిన దిగేందుకు తగిన ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారులు దృష్టి పెట్టాలి. దీని వల్ల సార్వా వరి సాగులో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది.

– కొల్లాబత్తుల ఏసయ్య, రైతు, శృంగవరప్పాడు

### ముంపు నీటితో సాగుకు అడ్డంకులు

నక్కలపర్ర భూముల్లో నెలలు తరబడి నిల్వ ఉంటున్న నీటిలో తూటు, గుర్రపుడెక్క, ఇతర పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి. సార్వాలో ఈ ఆయకట్టు భూములు దమ్ము చేసుకోవడంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– ఇంజేటి జీవన్‌రాజు, రైతు, శృంగవరప్పాడు

### తూరల ఏర్పాటుతో సాగునీటికి ఇబ్బందులు



నర్సిపూడిలో పంటకాలువపై అనధికారికంగా ఏర్పాటు చేసిన తూరలు

**ఆలమూరు:** పంటకాలువపై ఇష్టానుసారం తూరలు ఏర్పాటు చేసుకుని బడా రైతులు తమ కార్యకలాపాలను నిర్వహిస్తుండటంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంఘటన ఆలమూరు మండలంలోని నర్సిపూడిలో జరిగింది. కూటమి నేత ఒకరూ ఇష్టానుసారం కాలువను ఆక్రమించి చిన్న చిన్న తూరలు ఏర్పాటు చేసుకోవడంతో అదే క్రమంలో అనేక మంది రైతులు ఆ పద్ధతిని అవలంబిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దిగువకు సాగునీరు సక్రమంగా పారడం లేదని రాబోయే రబీ సీజన్‌లో అనేక సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుందని వారు వాపోతున్నారు. అలాగే పలువురు బడా రైతులు తమ సరిహద్దుల్లో చెట్లను పెంచి సాగునీటికి ఆటంకం కలిగిస్తున్నారు. ఇకనైనా అధికారులు సత్వరం స్పందించి అనధికారికంగా వేసిన తూరలను తొలగించి సాగునీరు సక్రమంగా పారేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రతం

**ఆలమూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం హనుమద్వ్రతం వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలమూరు, చింతలూరు, పెదపళ్ల, పినపళ్ల తదితర గ్రామాల్లో నెలకొన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో నిర్వహించిన ప్రాతఃకాల అభిషేకాలు, నాగవల్లీ దళార్చనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలమూరులో బస్టాండ్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో శైవాగమ పండితులు కాళ్లకూరి సూరిపండు, చింతలూరులోని శ్రీభక్తాంజనేయ స్వామివారి ఆలయంలో పెదపూడి వీర వెంకట సత్యనారాయణాచార్యులు వేద మంత్రాల మధ్య హనుమద్వ్రతం పూజలను తిలకించిన భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**మామిడికుదురులో..**

**మామిడికుదురు:** హనుమత్ వ్రతం సందర్భంగా ఆంజనేయస్వామికి తమలపాకులు, గంధ సిందూరంతో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పెదపట్నం, పెదపట్నంలంక గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల వద్ద సహస్ర నామార్చనలు, అభిషేకాలు, ఏకాహం పూజలు ఘనంగా జరిగాయి. పెదపట్నంలో 62వ ఏకాహంలో భాగంగా పలువురు ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ భజన చేశారు. పెదపట్నంలంకలో 19వ వార్షికోత్సవంలో భాగంగా క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, తదితర పూజల్లో పలువురు భక్త దంపతులు పాల్గొన్నారు. హనుమత్ వ్రతం సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి.



పెదపట్నంలో ఆంజనేయస్వామికి సిందూర పూజ చేస్తున్న అర్చకుడు



పెదపళ్లలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

**అయినవిల్లిలో..**

**అయినవిల్లి:** నేదునూరులోని సిరసవిల్లి సావరంలో కొలువైన సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆంజనేయస్వామివారికి హనుమద్ వ్రతం సందర్భంగా శుక్రవారం లక్ష సిందూర పూజ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పెదపూడి గోపాలచార్యుల ఆధ్వర్యంలో స్వామికి విశేష అభిషేకాలు, లక్ష తమలపాకులు, సింధూర పూజ జరిపారు. స్వామికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించారు. అలాగే అయినవిల్లి, నల్లచెరువు, ముక్తేశ్వరం, సిరిపల్లి, వీరవల్లిపాలెం తదితర గ్రామాల్లో ఆంజనేయ స్వామికి హనుమద్వ్రతం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతో వ్యాధులు దూరం



చింతలూరులో డ్రై డే నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య ఆశ సిబ్బంది

**ఆలమూరు:** గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు, ఆర్.మల్లికార్జున్, డి.సాయి కిషోర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం వైద్య ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమికీటకాలు దరి చేరవని, తద్వారా అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. ఈసందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.


# మరిన్ని అవార్డులు అందుకోవాలి

**సఖినేటిపల్లి:** అంతర్వేదిపాలెం కేంద్రంగా హ్యూమానిటీ హార్ట్స్ ఫౌండేషన్ ద్వారా సమాజ సేవలందిస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తాడి సహదేవ్ భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని నియోజకవర్గ తాడి సంక్షేమ సంఘ ప్రతినిధులు ఆకాంక్షించారు. శుక్రవారం ఉయ్యూరువారి మెరక శివారు వెలంకాయకోడు కాలువగట్టు ఏరియాలో, ఇటీవల విజయవాడలో పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ సదస్సులో ఉత్తమ సేవలకు గాను నిర్వాహకుల చేతుల మీదుగా జాతీయ సేవా రత్న అవార్డు తీసుకున్న సహదేవ్‌ను వారు ఘనంగా సత్కరించారు. సంక్షేమ సంఘ వ్యవస్థాపకుడు తాడి మున్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పై సత్కార కార్యక్రమంలో సత్య, డాక్టర్ మోహన్, వినోద్, డాక్టర్ కిరణ్, శ్రీను, ప్రభు, రవీంద్ర, రవి, రాము, వెంకట్ పాల్గొన్నారు.




వీవీమెరకలో తాడి సంక్షేమ సంఘ ప్రతినిధులు చేతుల మీదుగా సత్కారం పొందిన సహదేవ్


# భూ వివాదాల పరిష్కారానికే సదస్సులు



గంగలకుర్రు గ్రామ సభలో రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు



నేదునూరు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగలక్ష్మమ్మ



మోరిపోడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సు

**అంబాజీపేట:** భూ వివాదాల పరిష్కారానికి గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులే వేదికలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా హార్టీకల్చర్ జేడీ బీవీ రమణ అన్నారు. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారంలో తహసీల్దార్ జె.వెంకటేశ్వరి పర్యవేక్షణలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన రెవెన్యూ గ్రామ సభలను శుక్రవారం నిర్వహించారు. జేడీ రమణ మాట్లాడుతూ మండల కేంద్రంలో అధికారులు అందుబాటులో ఉంటారని, ఎప్పుడైనా వచ్చి ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇవ్వవచ్చన్నారు. 33 రోజుల్లో భూ వివాదాలు కొలిక్కి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులకు తెలుగులోనే రసీదు, తిరుగు సమాధానం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామ సభల్లో 54 అర్జీలు అందాయని తహసీల్దార్ వెంకటేశ్వరి తెలిపారు. పాస్ పుస్తకాలు, అడంగల్‌లో తప్పులు సరి చేయాలంటూ రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని విచారించి నిర్దిష్ట సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు గ్రామ సభల రికార్డులను పరిశీలించారు. అనంతరం గంగలకుర్రులో సిద్దార్థనగర్ కాలనీని జేడీ పరిశీలించారు. కాలనీ వాసుల సమస్యలను అధికారులకు వివరించారు. డ్రైనేజీ నిర్మించాలని కోరారు. సభలో ఆర్ఐ కె.ఏడుకొండలు, ఎంఎం శెట్టి, పులిదిండి ఏడుకొండలు, బందన రాంబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

**శ్మశానవాటికల్లో ఆక్రమణలు తొలగించాలి**

**అయినవిల్లి:** నేదునూరు సరిహద్దు గ్రామాల్లో ఏర్పాటు చేసిన శ్మశానవాటిక, ముక్తేశ్వరం శ్మశానవాటిక ఆక్రమణలకు గురయ్యాయని మోత వెంకటేశ్వరరావు శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ అధ్యక్షతన నేదునూరు, సిరిసవల్లి సావరంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ముఖ్యఅతిథిగా తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ హాజరయ్యారు. ఆన్‌లైన్, సర్వే, అడంగల్ తప్పులను సరిచేయడం వంటి వాటిపై 18 అర్జీలు వచ్చాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఎంపీటీసీ కళ్లేపల్లి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

**మోరిపోడులో..**

**సఖినేటిపల్లి:** మోరిపోడు పంచాయతీ వద్ద శుక్రవారం తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగాత్రివేణి అధ్యక్షతన జరిగిన సదస్సులో తహసీల్దార్ మాట్లాడుతూ, రైతుల భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికై సదస్సు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం భూములకు సంబంధించి పలు అంశాలపై అధికారులు వినతి పత్రాలను తీసుకున్నారు. డీటీ సీహెచ్ భాస్కర్, సర్వేయర్ భద్రరాజు, వీఆర్వోలు రమ్య, దుర్గ, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు ముప్పర్తి నాని, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఎన్నికల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి**

మండలంలో నీటి వినియోగదారుల సంఘ ఎన్నికల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, శనివారం మూడు సెంటర్లో నిర్వహించనున్న పై ఎన్నికల ప్రక్రియలో సంఘ మెంబర్లు, అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎన్నుకుంటారన్నారు.

# ఎన్‌జేఎంలో క్రిస్మస్ రజతోత్సవ వేడుకలు

**పి.గన్నవరం:** క్రీస్తు బోధనలు ఆచరణీయమని మాజీ ఎమ్మెల్యేలు కొండేటి చిట్టిబాబు, పాముల రాజేశ్వరీదేవి అన్నారు. నాగుల్లంక శివారు పెదకందాలపాలెంలోని న్యూ జెరూషలెం మినిస్ట్రీస్‌లో సంస్థ అధినేత రెవరెండ్ జి.దానియేలు ఆధ్వర్యంలో 25వ క్రిస్మస్ రజతోత్సవ మహా పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దానియేలు అధ్యక్షతన జరిగిన ఆధ్యాత్మిక సభలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. సమస్త మానవాళి రక్షణార్థం ఏసుక్రీస్తు జన్మించారని దానియేలు అన్నారు. ఏసుక్రీస్తు చూపిన శాంతి మార్గంలో అందరూ పయనించాలని అన్నారు. దానియేలు అందిస్తున్న సేవా కార్యక్రమాలను చిట్టిబాబు, రాజేశ్వరీదేవి అభించారు. వారిద్దరినీ దానియేలు సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి, బిషప్ వై.శరత్ భూషణం, డాక్టర్ కె.శ్యామ్‌పాల్, శామ్యూల్ సుకుమార్, లాజరస్ జోసఫ్, మేడిది పురుషోత్తం, కరుణకుమార్, జాన్‌బాబు, చరణ్, పీపీఎఫ్ పాస్టర్లు, కోనసీమ నలుమూలల నుంచి వేలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు.

### ఆలమూరు మండల అధికారుల ఫోన్ నంబర్లు

| హోదా | పేరు | ఫోన్ నంబర్ |
|---|---|---|
| తహసీల్దార్ | కెజె.ప్రకాష్‌బాబు | 98499 03902 |
| రావులపాలెం సీఐ | సీహెచ్.విద్యాసాగర్ | 94407 96537 |
| సబ్ ఇన్‌స్పెక్టర్ | ఎం.అశోక్ | 9440904849 |
| ఎంపీడీఓ | కె.జాన్‌లింకన్ | 94938 17051 |
| ఈఓపీఆర్‌డీ | ఏ రాజు | 83175 42815 |
| ఏడీఏ | కె.నాగేశ్వరరావు | 83310 56664 |
| ఏఓ | ఎస్.లక్ష్మీ లావణ్య | 83310 56557 |
| ఏపీఓ | జి.అరుణకుమారి | 70933 23644 |
| ఏపీఎం | ఎం.ధనరాజు | 98499 01696 |
| హౌసింగ్ జేఈ | డి.శ్రీనివాసు | 70939 30448 |
| ఎంఈఓ-1 | బి.అప్పాజీ | 80748 05733 |
| ఎంఈఓ-2 | కెవి.సుబ్బరాజు | 96189 37973 |
| ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ | పి.పద్మ | 91001 21135 |
| సీడీపీఓ. కొత్తపేట | పి.శారద | 94408 14683 |
| చొప్పెల్ల పీహెచ్‌సీ | డి.సువర్చలాదేవి | 70136 40523 |
| పెదపళ్ల పీహెచ్‌సీ | పి.భవానీశంకర్ | 88017 87816 |
| ఇరిగేషన్ జేఈ | కృష్ణ త్రిమూర్తులు | 83286 29109 |
| పశుసంవర్ధకశాఖ ఏడీ | ఎల్.అనిత | 95503 93727 |
| పశువైద్యాధికారి | జి.భానుప్రసాద్ | 95332 87404 |
| ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ | డి.నాగేశ్వరరావు | 97012 87828 |
| ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ | పి.రాంబాబు | 91609 88844 |
| ఐసీడీఎస్ సూపర్‌వైజర్ | టిఎస్‌వి.నాగలక్ష్మి | 63099 39852 |
| ఐసీడీఎస్ సూపర్‌వైజర్ | వై.అరుంధతి | 89778 30575 |
| ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి | పి.గోపిరామ్ | 93467 87187 |
| మండల ఇంజనీరింగ్ జేఈ | డి.వీరభద్రరావు | 83175 43987 |
| ఆర్అండ్‌బీ జేఈ (ఇన్‌చార్జి) | సూర్యనారాయణ | 94408 18285 |